లిటిల్ ల్యాంబ్ చర్చిలో న్యూ ఇయర్ వేడుకలు



వేడుకలో పాల్గొన్న క్రిస్టియన్ ప్రతినిధులు

వనస్థలిపురం: నూతన సంవత్సరం సందర్భంగా వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ రెవ.కే.సుదర్శన్‌రావు, రెవ.ప్రమోద్‌కుమార్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా పాస్టర్లు, చర్చి పెద్దల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబూరావు, జార్జిముల్లర్, సురేష్‌కుమార్, భానుకిరణ్, జాన్, రఘురాం, జాకబ్ ప్రసాద్, కాంతా రమేష్, విజయలక్ష్మి లాజరస్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..
టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.13, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.37, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.26, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.21, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.08, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.35, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.45, బీట్‌రూట్ రూ.35, కీర రూ.23, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.50.
ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: నూతన సంవత్సరం సందర్భంగా ఎల్‌బీనగర్, కొత్తపేట, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారికి ఎల్‌వీ సేవా వేదిక చైర్మన్ ఎల్‌వీకుమార్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ ఎస్సై మారయ్య, మదూరి శ్రీనివాస్, సత్తయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, ఆంజనేయులు, చంద్రకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 96 మందిపై కేసు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మలక్‌పేట: నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 96 మంది వాహనదారులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. వారిలో 12 ఫోర్ వీలర్స్, 84 ద్విచక్ర వాహనదారులు ఉన్నారన్నారు.



ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో పెరిగిన నేరాలు

నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనరేట్, ఎల్‌బీనగర్ జోన్ 2 డివిజన్ పరిధిల్లో 9 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. గతేడాది కన్నా ఈ సారి క్రైమ్‌రేట్ పెరిగింది. పోలీసులు నేరాల నియంత్రణ కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నా అంతగా ఫలించడం లేదనే చెప్పాలి. తీవ్ర నేరాలు మాత్రం కొంత మేర తగ్గినా సైబర్ నేరాలు భారీగా పెరిగాయి. ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, చైతన్యపురి, నాగోలు, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట, మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో 2024లో 9 పోలీస్ స్టేషన్ పరిధిలో 10,419 కేసులు నమోదయ్యాయి. ఇందులో మోసం, సాధారణ చోరీలు, రోడ్డు ప్రమాదాలు అధికంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డివిజన్ పరిధిలోని నేరాలను అదుపు చేసేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. కేసుల ఛేదనలో సీసీ కెమెరాల ఫుటేజీలు, అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ క్రైమ్ రేటును నియంత్రించేందుకు కృషి చేస్తున్నారు. నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించడం, గొడవలు జరిగితే బాధ్యులపై కేసులు నమోదు చేయడం, రోడ్డు ప్రమాదాలు జరగడం, పాత నేరస్తులు తిరిగి నేరాలకు పాల్పడకుండా వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు.

- వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ గంజాయి కేసులు 75 నమోదయ్యాయి. వీటిలో వెయ్యి కిలోల గంజాయి, రెండు కిలోల నల్లమందు (ఓపీఎం), 373 గ్రాముల హెరాయిన్ 66 గ్రాముల ఎంఐఎంపీ, ఏడు కిలోల హష్ ఆయిల్, 300 గ్రాముల ఆల్ప్రోజోలం, 6 గ్రాముల చరస్ స్వాధీనం చేసుకున్నారు.
- 92 గేమింగ్ యాక్ట్ కేసులు నమోదుకాగా 518 మందిని అరెస్టు చేసి 5 ఇళ్లు, రూ. 45.93 లక్షల స్వాధీనం చేసుకున్నారు.
- 28 పీటా కేసులు నమోదు చేశారు. ఇందులో 28 బాధితులకు గుర్తించారు. మొత్తం 63 మంది 32 మంది నిర్వాహకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
- 1265 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 1122 వ్యక్తులను గుర్తించారు.
- 12 కేసుల్లో 10 సంవత్సరాలు జీవిత ఖైదు విధించడ్డాయి. వీటిలో 3 హత్యకేసులు, 9 అత్యాచారం, పోక్సో కేసులు ఉన్నాయి.

గతేడాది 525గా ఉన్న సైబర్ నేరాలు 2024లో 1,036కు చేరాయి. రాచకొండ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు దోచుకున్న రూ. 22 కోట్ల నగదును బాధితులకు అందజేశారు.

- జోన్ పరిధిలో 25 గొలుసు చోరీలు నమోదు కాగా, ఆయా కేసుల్లో నిందితులందరినీ జైలుకు పంపారు.
- చోరీ కేసులో 2023, 2024 పోలిస్తే 5 శాతం అధికంగా 66. 58 శాతం బాధితుల సొత్తు స్వాధీనం చేసుకున్నారు.
- జోన్ పరిధిలో పోగొట్టుకున్న, చోరీలకు గురైన సెల్ ఫోన్లు రికవరీలో రాష్ట్ర వ్యాప్తంగా టాప్ 10 పోలీస్ స్టేషన్‌లో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన మొదటి స్థానంలో ఉంది. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ మూడో స్థానంలో నిలిచాయి.

	2023	2024
హత్యలు	21	13
హత్యాయత్నాలు	49	20
మోసం	949	835
అత్యాచారాలు	110	111
దోపిడీలు	50	21
ఇళ్లలో చోరీలు	252	169
సాధారణ చోరీలు	1315	636
రోడ్డు ప్రమాదాలు	831	415
కిడ్నాప్‌లు	175	72

నేరాల నియంత్రణకు కృషి



ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో నమోదైన కేసులు 90 శాతం పరిష్కారమయ్యేలా కృషిచేశాం. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు విద్యా సంస్థల్లో విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహిళలపై జరిగిన నేరాల విషయంలో నిందితులందరికీ శిక్షలు పడేలా చేశాం. 100కు ఫోన్ చేసిన ఐదు నిమిషాల్లోనే ఘటాన స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటాం.

–డీసీపీ ప్రవీణ్‌కుమార్

శుభాకాంక్షలు



నూతన సంవత్సర నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- లక్డీకాపూల్



హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- సైదాబాద్

నియామకం



హుడాకాంప్లెక్స్: ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ జిల్లా చైర్మన్‌గా కొత్త రవిగుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ రవిగుప్తాకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. రాబోయే మండల, డివిజన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు పోటీ చేయడానికి, రాజకీయంగా ముందుకు రావడానికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. ఈ నెల 5న గుప్తా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు చెప్పారు. తన నియామకానికి సహకరించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ రంగ నాయకుల కాలనీలోని జేరుషలేం కవనెంట్ చర్చిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. పాస్టర్ రెవరెండ్ ఎ.మున్యా మోజెస్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. 2025వ సంవత్సరంలో దేవుని సన్నిధి అందరిపై ఉంటుందని, ప్రతి కుటుంబం ప్రేమతో, అనురాగంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రుబీన్‌నాయక్, హెప్సిబాబాయి, చిన్ని బ్యూలా పాల్గొన్నారు.

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య

నాగోలు: కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లా, హిందూపూర్ టౌన్‌కు చెందిన లావణ్య(26) నగరానికి వచ్చి మోహన్‌రావుతో రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలో ఎస్‌వీ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. మోహన్‌రావు నగరంలో మెడికల్ రిప్రెసెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా ఇద్దరి నడుమ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ కలహాలే లావణ్య మృతికి కారణమని స్థానికులు పేర్కొంటున్నట్లు పోలీసులు తెలిపారు.

కేలండర్ల ఆవిష్కరణ

నూతన సంవత్సరం సందర్భంగా వివిధ సంస్థలు, సంఘాలు, దేవాలయాల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్లు, డైరీలను ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆవిష్కరించారు.

–ఎల్‌బీనగర్ జోన్ బృందం



భూలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి ఆవిష్కరించారు



కురుమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం కురుమ ఆవిష్కరించారు



యాదవ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ ఆవిష్కరించారు



విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ కేలండర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ చీర్ల నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



నిబంధనలు పాటించని వారికి పువ్వులిచ్చి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నాగోలు: రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాలకు తీవ్ర శోకాన్ని మిగుల్చుతున్నారని అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నాగోలు ఆర్టీఏ ఇన్‌చార్జి అమర్‌నాథ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆదేశాల మేరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను బుధవారం నాగోలులోని ఆర్టీఏ కార్యాయలం, నాగోలు పోలీస్ స్టేషన్ సంయుక్తంగా ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం–రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం అనే నినాదంతో నాగోలు కార్యాలయం నుంచి నాగోలు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా, సీటు బెల్టు పెట్టకుండా వాహనాలు నడిపిన వారికి పువ్వులు అందజేసి వినూత్నంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగాక వచ్చే నష్టం జీవితాంతం తీవ్రంగా కలవర పెడుతోందని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు అనితారెడ్డి, శ్రీధర్, విష్ణుదీపక్‌రెడ్డి, నాగోలు సీఐ శివనాగ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆ భూములను కాపాడుకుందాం



హస్తినాపురం: జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధి హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన భూములను ఆక్రమణదారులకు రిజిస్ట్రేషన్ చేయవద్దని కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మంకాల శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కాలనీవాసులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేసినట్లు శేఖర్‌రెడ్డి తెలిపారు. తమ కాలనీలో ప్రజా ప్రయోజనాలకోసం కేటాయించిన రూ. కోట్లు విలువ చేసే భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత కాలనీవాసుల ఉందన్నారు. ఈ సమావేశంలో ఐలేష్‌గౌడ్, గోవర్ధర్‌రెడ్డి, జి.నరేందర్ రెడ్డి, వైకుంఠరామిరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, వెంకటరమణారెడ్డి, వీరేందర్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అన్ని రోడ్లకు మరమ్మతు చేయడంతో పాటు కొత్తగా రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయించడం జరుగుతోందన్నారు. త్వరలో అన్నికాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వామ్యం కావాలన్నారు. ర్యాంపులు లేకుండా కాలనీలో రోడ్లు వేసేందుకు అందరు సహకరించాలని కోరారు. కార్పొరేటర్ వెంట శరత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, నికేతన్‌రెడ్డి, వినయ్ ఉన్నారు.

ఘనంగా ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని వేంకటేశ్వర దేవాలయంలో ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి దివ్య మంగళ శాసనములతో, తిరుమల తిరుపతి దేవస్థానం, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ వారి సౌజన్యంతో హంపీ విరూపాక్ష విద్యారణ్య సంస్థానం ఆధ్వర్యంలో వెంకట నర్సింహచార్యులతో ప్రవచనాలు జరిగాయి. భక్తులు ప్రతి రోజు ప్రవచనాలకు హాజరు కావాలని వారు కోరారు.

నూతన సంవత్సరం.. ఆలయాలకు భక్తజనం



వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్త జనసందోహం

చంపాపేట: నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలు కిక్కిరిసాయి. చంపాపేట డివిజన్ పరిధిలోని పలు ఆలయాలకు బుధవారం తెల్లవారు జాము నుంచే భక్తులు బారులుతీరారు. ఆయా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు, తీర్థ ప్రసాదాల వితరణ, తాగునీరు వంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయానికి రాజకీయ నాయకులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున హాజరై నూతన సంవత్సరంలో తమకు ఎలాంటి ఆటంకాలు రాకుండా అంతా మంచే జరగాలని పూజలు నిర్వహించారు.

- నూతన సంవత్సరం సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీ రహదారుల వెంట టెంట్లు వేసి అమ్మకాల ఆఫర్లతో కేక్‌లు బిర్యానీ, స్వీట్లు, కూల్ డ్రింక్స్ సెంటర్లను ఏర్పాటు చేశారు. దీంతో కొనుగోలుదారులతో ఆయా సెంటర్లు కిటకిటలాడాయి.

అష్టలక్ష్మి దేవాలయంలో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాసం, నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తోరణపూజ, గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మాజీ చైర్మన్ బంధం దామోదర్ గుప్తా, మేడం సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్లు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

చైతన్యపురి: నూతన సంవత్సరం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయాన్ని బెలూన్లు, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నందున ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ బీవీ శ్యాంకుమార్ తెలిపారు. తెల్లవారు జామునుంచే భక్తులు బాబా దర్శనం కోసం బారులు తీరారు. బాబా వెండి పాదాలను గర్భగుడి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. భక్తులు అఖండ సాయి నామంతో ప్రత్యేక భజనలు, పారాయణాలు చేశారు.



బాబా వెండి పాదుకలను మొక్కుతున్న భక్తురాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



దర్శనం కోసం బారులుతీరిన భక్తులు